సాక్షి కర్నూలు
శుక్రవారం । 30 । జూన్ । 2023



మల్లన్నకు నృత్యనీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిత్యకళావేదికపై గురువారం హైదరాబాద్‌కు చెందిన నృత్యప్రియ డ్యాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



తేజోమయం

దిగువ అహోబిలంలో గురువారం శ్రీ ప్రహ్లాదవరదస్వామిని గరుడవాహనంపై ఊరేగించారు. ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా జ్యేష్టాభిషేకం పూజలు చేశారు. 8లో▸



అదిగో ఇల్లు.. ఇదిగో కాలనీ

ఇళ్ల నిర్మాణాలు పూర్తయి జగనన్న కాలనీలు ఊర్లను తలపిస్తున్నాయి. పేదలు గృహ ప్రవేశం చేస్తున్నా ఎల్లో మీడియా అవాస్తవ కథనాలను అల్లుతోంది. 8లో▸

న్యూస్‌రీల్

పంచాయతీ కార్యదర్శులకు నేడు అంతర్ జిల్లా బదిలీలు

కర్నూలు(అర్బన్): జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశాల మేరకు జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్-5, 6 పంచాయతీ కార్యదర్శుల అంతర్ జిల్లా బదిలీలను ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బదిలీలకు 26 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఉదయం 10.30 గంటలకు బదిలీల ప్రక్రియ చేపడతామన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అదర్ కేటగిరీ కింద జిల్లా పరిధిలో బదిలీలు కోరుతూ దరఖాస్తు చేసుకున్న గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు, 2.30 గంటలకు గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

మరికొంత మంది టీచర్లకు పదోన్నతులు

కర్నూలు సిటీ: ఉమ్మడి కర్నూలు జిల్లాలో మరికొంత మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు రానున్నాయి. ఇటీవల మండల విద్యాధికారులుగా ప్రధానోపాధ్యాయులను నియమించారు. దీంతో హెచ్‌ఎం పోస్టులు ఖాళీ అయ్యాయి. స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు ఇచ్చి ఆ ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ పదోన్నతులకు సంబంధించి నేడు(శుక్రవారం) సీనియారిటీ జాబితాను విడుదల చేయనున్నట్లు డీఈఓ రంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోన్నతుల ద్వారా 55 హెచ్‌ఎం పోస్టుల్లో సీనియర్ స్కూల్ అసిస్టెంట్లను, 187 స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో ఎస్‌జీటీలను నియమించనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 3, 4 తేదీల్లో పదోన్నతులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని తెలిపారు.

మద్యం సేవించి ఆలయంలోకి

- ఐదుగురిపై కేసు నమోదు



పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసులు

మహానంది: మద్యం సేవించి ఆలయంలోకి ప్రవేశించిన ఐదుగురు వ్యక్తులను దేవస్థానం సిబ్బంది గుర్తించి పోలీసులకు అప్పగించారు. నంద్యాల మండలం అయ్యలూరు గ్రామానికి చెందిన ముగ్గురు, మహానంది మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మద్యం సేవించి గురువారం మహానంది ఆలయంలోకి వచ్చారు. వీరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జి. నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. మద్యం తాగి పవిత్రమైన ఆలయాల్లోకి రావడం మంచిపద్ధతి కాదని హితవు పలికారు. ఇకపై ఆలయ ముఖద్వారం వద్ద బ్రీత్ అనలైజర్లతో డ్రంకన్ పరీక్షలు చేపడుతామన్నారు. ఎవరైనా మద్యం తాగి పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


నేటి నుంచి స్కిల్ టెస్ట్

కర్నూలు సిటీ: కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో 233 పోస్టుల భర్తీకి శుక్రవారం నుంచి పెద్దపాడు ఏపీ మోడల్ స్కూల్‌లో స్కిల్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఇందుకు జిల్లా స్థాయి కమిటీని నియమించారు. ఈ కమిటీకి జిల్లా జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గాను, సమగ్ర శిక్ష అదనపు కో-ఆర్డినేటర్ మెంబర్ కన్వీనర్‌గాను, డీఈఓ, జీసీడీఓ/అసిస్టెంట్ జీసీడీఓ, ఆయా సబ్జెక్టుల నిపుణులు సభ్యులుగా ఉంటారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయి తుది జాబితాలోని టాప్-3లో ఉన్న వారిని స్కిల్ టెస్ట్‌కు ఆహ్వానించారు. మొదటి రోజు ఉదయం ప్రిన్సిపాల్ పోస్టుల భర్తీకి, మధ్యాహ్నం హిందీ, ఇంగ్లిషు అధ్యాపకుల పోస్టుల భర్తీకి స్కిల్ టెస్ట్ నిర్వహించనున్నారు.



కొన్ని ఉత్పత్తులతో అనారోగ్య సమస్యలు


కాలం చెల్లిన షాంపు, పర్ఫ్యూమ్ ఇతర ఆహార ఉత్పత్తులు బైవన్ గెట్ వన్ ఆఫర్ల కింద మాల్స్‌లో విక్రయిస్తారు. వీటిని కొంటే దుష్పరిణామాలు తప్పవు. ఫుడ్‌ప్రాడక్ట్స్‌లో రెండు ప్రధాన కంపెనీలు ఎక్కువ ఉత్పత్తులను తయారు చేస్తున్నాయి. ఇవి నిల్వ ఉండటం కోసం ఉప్పును ఎక్కువగా వినియోగిస్తారు. కొన్నింటిలో రసాయనాలు మిలితం చేస్తున్నారు. ఇలాంటివి తినడం వల్ల ఆరోగ్యానికి హానికరమని వైద్యులు సూచిస్తున్నారు.



కార్పొరేట్ నిత్యావసరం!

సరుకుల పట్టీ లేకుండానే కొనుగోళ్లు

- మల్టీనేషనల్ కంపెనీల వలలో సామాన్య, మధ్య తరగతి ప్రజలు
- అనవసర ఉత్పత్తులు జీవితంలో భాగం
- అవసరం లేకపోయినా కొనుగోలుకు ఆసక్తి
- సూపర్ మార్కెట్, మాల్స్ రాకతో పెరిగిన ఖర్చులు
- ఇతరులను అనుసరించే క్రమంలో నష్టం



ఈ ఫొటోలో ఉన్న సరుకుల పట్టి 1971లోది. ఇవన్నీ నిత్యావసర సరుకులే. ఒక్కటీ వృథా వస్తువు కనిపించదు. నెల రోజులకు అవసరమయ్యే వీటి విలువ అక్షరాలా రూ.44.55 మాత్రమే. ఇప్పుడు మాల్స్‌కు వెళితే వీటితో పాటు రెట్టింపు సంఖ్యలో మల్టీనేషనల్ కంపెనీలకు చెందిన వస్తువులను అవసరం లేకపోయినా కొంటున్న పరిస్థితి నెలకొంది. బిల్లు కూడా ఇదే స్థాయిలో తడిసి మోపెడవుతోంది.

➤ పాతికేళ్ల కిందట నిత్యావసర వస్తువులు(సరుకులు) కొనాలంటే కిరాణాకొట్టుకు వెళ్లి లిస్ట్ ఇచ్చేవాళ్లం. ఆ మేరకు గుమాస్తా సరుకులు కట్టిచ్చేవాడు. నూనె మాత్రమే మిల్లులో కొనేవాళ్లం. సబ్బులు, పళ్లపొడి మాత్రమే ఇతర వస్తువులు. ఇవి మినహా మరొకటి తెలిసేవి కావు. ఇప్పుడు కాస్మోటిక్స్, లైజాల్, లోషన్స్, హెయిర్ ప్రాడక్ట్స్, ఫుడ్‌ప్రాడక్ట్స్, క్రీమ్స్, ప్లాస్టిక్, ఇతర వస్తువుల విషయానికొస్తే ఇళ్లు, బట్టలు, గిన్నెల శుభ్రం చేసుకునే వస్తువుల నుంచి చాలా ఉత్పత్తులు అనివార్యంగా కొంటున్నాం. నిత్యావసర వస్తువుల జాబితాలో వీటిని కూడా 'కార్పొరేట్' కంపెనీలు బలవంతంగా రుద్దుతుండటం గమనార్హం.

➤ 'సూపర్ మార్కెట్‌కు వెళితే ట్రాలీలో నిత్యావసర సరుకులు తీసుకునేలోపు సగం ట్రాలీ జీవనానికి అత్యవసరం లేని వస్తువులతో నిండిపోతుంది. తీరా బిల్లు చూస్తే ఏది కొనాలని వచ్చామో అది కాకుండా మన జాబితాలో లేని వస్తువుల బిల్లు అధికంగా ఉంటోంది. ఒక్కమాటలో చెప్పాలంటే కిరాణాకొట్టుకు వెళితే రూ.1500 బిల్లు అయితే, మాల్స్‌కు వెళితే రూ.3వేలు దాటుతోంది. ఈ పరిస్థితి సామాన్య, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతోంది.

... ఈ రెండు అంశాలను పరిశీలిస్తే పాతికేళ్ల ముందు, ఇప్పుడు నిత్యావసర వస్తువుల జాబితా ఏ తరహాలో మారిపోయిందో అర్థమవుతోంది.

సాక్షి ప్రతినిధి కర్నూలు: మల్టీనేషనల్ కంపెనీల రాకతో ప్రతీ రంగంలో మార్పులు వచ్చినట్లే రిటైల్ రంగంపైనా ఆ ప్రభావం అధికంగా ఉంటోంది. పాతికేళ్ల ముందు మార్కెట్‌లో లేని ఉత్పత్తులు, వాటి వాడకం అవసరం లేకపోయినా కచ్చితంగా కొనాల్సిందే అనే స్థితికి ప్రజలను మల్టీనేషనల్ కంపెనీలు తీసుకొచ్చాయి. ఇరుగుపొరుగు ఇళ్ల జీవన శైలి, పిల్లల పెంపకం, జనరేషన్ మార్పు తదితర అంశాలతో కొన్ని వస్తువులు బలవంతంగా దైనందిన జీవితంలోకి చొరబడుతున్నాయి. మంచి ఉద్యోగాలు, ఆదాయం బాగా ఉన్న కుటుంబాలు వీటి కొనుగోలుకు ఇబ్బంది పడవు. అయితే సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇరుగుపొరుగు ఇళ్లలోని వస్తువులు, వాడకం చూసి వాటిని తామూ కొనుగోలు చేయాలనే భావనకు వచ్చేస్తున్నారు. ఇలా ఒకరిని చూసి ఒకరు పోటీ పడుతుండగా.. వీరిని మల్టీనేషనల్ కంపెనీలు తమ ఉచ్చులోకి లాగుతున్నాయి. ఒక్కసారి వీటికి అలవాటు పడితే బయటపడటం చాలా కష్టం. ఇండియాలో ఓ సర్వే ప్రకారం కిరాణాకొట్టుకు వెళితే అయ్యే బిల్లు కంటే, సూపర్‌మార్కెట్‌కు వెళితే 210శాతం, మాల్స్‌కు వెళితే 300 శాతం ఎక్కువగా ఉంటోంది. అంటే కిరాణాకొట్టులో రూ.వెయ్యి బిల్లు అయితే, సూపర్ మార్కెట్‌లో రూ.2,100, మాల్స్‌కు వెళితే రూ.3వేలు బిల్లు అవుతోంది.

'సూపర్' మ్యాజిక్‌తో బిల్లు తడిసి మోపెడు

సూపర్‌మార్కెట్‌కు వెళ్లేవారిలో 95శాతం మంది నిత్యావసర సరుకులకు వెళ్తారు. ట్రాలీ తీసుకుని వెళితే మాల్ ప్రారంభంలో సరకులు ఉండవు. వాటిని చివరలో పెడతారు. అక్కడకు చేరుకునేందుకు ఇతర ఉత్పత్తులు చూసుకుంటూ వెళ్లాలి. అప్పటికీ ఏమీ కొనలేదు కాబట్టి బిల్లుపై ధ్యాస లేకుండా ట్రాలీలో వస్తువులను వేసుకుంటారు. బైవన్ గెట్‌వన్, ఇతర ఆఫర్ల ఉచ్చులో పడి మరిన్ని కొంటారు. తీరా సరుకుల వద్దకు వెళితే అవి కచ్చితంగా అవసరం కాబట్టి కొని తీరాల్సిందే! చిన్నపిల్లల బిస్కెట్లు, ఫుడ్‌ప్రాడక్ట్స్ పిల్లల ఎత్తును దృష్టిలో ఉంచుకుని కింద భాగంలో ఉంచుతారు. పిల్లలకు కనిపిస్తూనే వీటిని ట్రాలీలో వేస్తారు. చివరగా బిల్లింగ్ సమయంలో వేచి ఉండటం తప్పనిసరి. కౌంటర్ వద్ద లాలీపాప్, ఐస్‌క్రీం, చాక్లెట్స్‌తో పాటు పిల్లలను ఆకర్షించే ఉత్పత్తులు ఉంచుతారు. ఆ సమయంలో పిల్లలు వీటిని కొందామంటే తల్లిదండ్రులు కాదనలేని పరిస్థితి. ఇలా రూ.2వేల బడ్జెట్‌తో మాల్‌కి వచ్చే కస్టమర్‌తో రూ.3వేల నుంచి రూ.4వేల బిల్లు చేయించాలనే లక్ష్యంతో మాల్స్ నిర్వాహకులు ఉంటున్నారు. ఈ మార్పు సామాన్య, మధ్య తరగతి ప్రజల జేబును గుల్ల చేస్తోంది.

బడ్జెట్ తలకిందులు



మా చిన్నతనంలో ఇంటికి ఎంత మేర సరుకులు అవసరమో లిస్టు రాసుకొని కిరాణా షాపునకు వెళ్లి తెచ్చేవాళ్లు. కార్పొరేట్, సూపర్ మార్కెట్‌ల రాకతో సరుకుల కొనుగోలు తీరు మారిపోయింది. అవసరం ఉన్నా, లేకపోయినా కొనుగోలు చేయాలనిపిస్తుంది. ఈ కారణంగా నెలవారీ బడ్జెట్ తలకిందులవుతోంది.

– ప్రసన్న, గృహిణి, కర్నూలు

లగ్జరీకి అలవాటు పడ్డాం



కార్పొరేట్ కంపెనీల రంగ ప్రవేశంతో మార్కెట్‌లోకి సరికొత్త వస్తువులు వచ్చేశాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా లగ్జరీకి అలవాటు పడుతున్నాం. ఈ కారణంగానే కొత్త వస్తువు ఏది వచ్చినా వాడి చూద్దామని కొంటున్నాం తప్పితే అవసరమా, లేదా అని ఆలోచించడం లేదు.


– మౌనిక, డాక్టర్ ఆఫ్ ఫార్మసీ

ప్రతీ అవసరానికి మార్కెట్‌లో ఒక ఉత్పత్తి



పురుషులు ఆముదం, స్త్రీలు కొబ్బరి నూనె! ఈ రెండే గతంలో హెయిర్ ఉత్పత్తులు. ఇప్పుడు పదుల సంఖ్యలో నూనెలు, హెయిర్‌జెల్స్, హెయిర్ కలర్స్‌తో పాటు ఎన్నో రకాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. కాస్మోటిక్స్ అంటే పౌడర్ మినహా మరొకటి తెలిసేది కాదు పాత తరానికి. ఇప్పుడు కాస్మోటిక్స్ ఉత్పత్తులకు ఎక్స్‌క్లూజివ్ షోరూంలు ఏర్పాటయ్యాయి. సూపర్ మార్కెట్‌లో వీటికి ప్రత్యేకంగా ఒక విభాగమే ఉంటుంది. చిన్నపిల్లలకు సబ్బు, శనగపిండి వాడేవారు. తినేందుకు రాగిసంగటి పెట్టేవారు. ఇప్పుడు లోషన్స్, క్రీమ్స్‌తో ఎన్నో ఉత్పత్తులు. సెరిలాక్‌తో పాటు పలు రకాల ఫుడ్‌ప్రాడక్ట్స్ ఆకర్షిస్తున్నాయి. ఇంట్లో బండలు శుభ్రం చేసుకునేందుకు లైజాల్ నుంచి గిన్నెలు శుభ్రం చేసుకునేందుకు సబ్బులు, లిక్విడ్, చివరకు అద్దాలు తుడుచుకునేందుకు కాలిన్, మంచి వాసన వచ్చేందుకు ఇంట్లో, ఆఫీసుల్లో కూడా 'స్ప్రే'లు వినియోగిస్తున్నాం. ఇవన్నీ లేకపోయినా జీవనానికి వచ్చిన ఇబ్బంది లేదు. అయితే వీటిని బలవంతంగా జీవితంలోకి మల్టీనేషనల్ కంపెనీలు నెడుతున్నాయి.





కర్నూలు కొత్తబస్టాండ్ వద్ద ఉన్న ఈద్గా బయట ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, సందేశం ఇస్తున్న ప్రభుత్వ ఖాజీ సయ్యద్ సలీంబాషా ఖాద్రి

భక్తిశ్రద్ధలతో బక్రీద్

బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాలకు వెళ్లలేని వారు సమీపంలోని మసీదులకు వెళ్లి నమాజు చేశారు. సర్వ మానవాళి శాంతి కోసం, జీవితంలో చేసిన పాపాల విముక్తి కోసం అల్లాహ్‌ను వేడుకున్నారు. అనంతరం ఈద్ ముబారక్ చెప్పుకుంటూ ఆలింగనం చేసుకున్నారు. మత పెద్దలు బక్రీద్ పండుగ గొప్పతనాన్ని వివరించారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడిచి దైవానుభూతి పొందాలని సూచించారు. – కర్నూలు(రాజ్‌విహార్)

వరుణుడి కరుణ కోసమే సహస్ర ఘటాభిషేకం

- దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ



అమ్మవారికి సారె తీసుకెళ్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఈఓ లవన్న తదితరులు

శ్రీశైలంటెంపుల్: ప్రకృతి మాత అనుగ్రహించి, వరుణదేవుడి కరుణించి వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం పాడిపంటలతో కళకళలాడాలనే సంకల్పంతో శ్రీశైల మల్లికార్జున స్వామివారికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవ దాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం శ్రీశైల మల్లికార్జున స్వామివారికి నిర్వహించిన సహస్ర ఘటాభిషేకం కార్యక్రమంలో మంత్రి దంపతులు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గణేశ సదనాన్ని త్వరలోనే ప్రారంభించి భక్తులకు అందుబాటులోకి తెస్తామన్నారు. అలాగే సాలు మండపాల నిర్మాణం, భక్తుల సౌకర్యార్థం నూతన క్యూ కాంప్లెక్స్ నిర్మాణాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేస్తామన్నారు. కోర్టు ఉత్తర్వులకు మేరకు పీఠాధిపతుల అభిప్రాయం తీసుకున్న అనంతరం మహాకుంభాభిషేకం తేదీని నిర్ణయిస్తామని చెప్పారు. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు శ్రీశైల క్షేత్ర ప్రాశస్త్యం విశ్వానికి తెలిసేలా సెమినార్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

అమ్మవారికి ఆషాఢసారె

ఆషాఢమాసం సందర్భంగా శ్రీశైల భ్రమరాంబాదేవికి సారె సమర్పించామని, ఈ మాసమంతా రాష్ట్రంలోని అన్ని అమ్మవారి దేవాలయాల్లో అషాడసారె నిర్వహిస్తామని మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ముందుగా పట్టు వస్త్రాలకు ఆలయ రాజగోపురం వద్ద అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజాదికాలను నిర్వహించారు. అనంతరం మంత్రితో పాటు దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, శ్రీశైలం దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ ఎస్.లవన్న, ధర్మకర్తల మండలి సభ్యులు తలపై పట్టువస్త్రాలు పెట్టుకుని తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



సబ్సిడీ టమాటా.. వినియోగదారులకు ఊరట

- రైతు బజార్లలో కిలో రూ.50 ప్రకారం అందజేత
- మొదటి రోజు 7 టన్నుల పంపిణీ



సీ క్యాంప్ రైతు బజార్‌లో వినియోగదారులకు సబ్సిడీపై టమాటాను అందజేస్తున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై టమాటాను పంపిణీ చేస్తుండడంతో వినియోగదారులకు ఊరట లభిస్తోంది. మార్కెట్‌లో కిలో టమాటా రూ.100 పలుకుతోంది. సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేయలేకపోతున్నారు. దీంతో రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి 7 టన్నుల టమాటాను తెప్పించింది. రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ హరీష్‌కుమార్, హార్టికల్చర్ కన్సల్టెంట్ శివకుమార్ ఆధ్వర్యంలో గురువారం కర్నూలు నగరంలోని సీ క్యాంప్, అమీన్ అబ్బాస్ నగర్, కొత్తపేట రైతు బజార్లలో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయించింది. స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా వినియోగదారులకు కిలో టమాటా రూ.50 ప్రకారం అందజేశారు. దీంతో వినియోగదారులకు ఊరట లభించింది. ఈ సందర్భంగా ఎస్టేట్ ఆఫీసర్ హరీష్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో టమాటా కొరత తీవ్రంగా ఉండడం, తక్కువ సరుకు రావడంతో ధర కూడా పెరిగిందన్నారు. మదనపల్లి నుంచి తీసుకొచ్చిన 7 టన్నుల టమాటాలను సీ క్యాంప్ రైతు బజార్‌కు 5 టన్నులు, అమీన్ అబ్బాస్ నగర్, కొత్తపేట రైతుబజార్లకు ఒక్కొక్క టన్ను చొప్పున కేటాయించామన్నారు. ఉదయం 8 గంటలకు పంపిణీ ప్రారంభించగా, సాయంత్రం 4 గంటలకు పూర్తయిందన్నారు. ఒక్కో వినియోగదారునికి ఒక కిలో ప్రకారం అందజేశామని పేర్కొన్నారు. ప్రతి రోజూ 4 నుంచి 6 టన్నుల టమాటా అవసరమవుతుందని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్‌కు తెలియజేశామన్నారు.

కలెక్టర్ పేరు చెప్పి మోసం

- చీటింగ్ కేసు నమోదు

కర్నూలు(సెంట్రల్): కలెక్టర్ పేరు చెప్పి ఖజానా శాఖలో జూనియర్ అసిస్టెంటు పోస్టులు ఇప్పిస్తామని కర్నూలు బీక్యాంపునకు చెందిన వైడూర్య అనే మహిళ చేస్తున్న మోసం బట్టబయలైంది. ఈ విషయం కలెక్టర్ దృష్టికి రావడంతో ఆమెపై కేసు నమోదు చేయించాలని ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఖజానా జిల్లా ట్రేజరి, అకౌంట్స్ అధికారి రామచంద్రరావు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో వైడూర్యపై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు 420 ఐపీసీ సెక్షన్ కింద ఎఫ్ఐఆర్ ఫైల్ చేసి ఫిర్యాదును 253/2023గా రిజిష్టర్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడితే చట్ట ప్రకారం ఎంతటి వారిపైన అయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి వ్యక్తులను ఎవరూ నమ్మొద్దని సూచించారు. ప్రభుత్వంలో ఏ నియామకాలు అయినా నోటిఫికేషన్ ద్వారా పారదర్శకంగా జరుగుతాయని చెప్పారు.



అదిగో ఇల్లు.. ఇదిగో కాలనీ

ప్రజా స్పందనలో ఇల్లు మంజూరు చేయండి అంటూ ఒక్క వినతి లేదు.. పక్కా ఇంటికి స్థలం ఇవ్వండనే అర్జీలు అసలే లేవు. ఎందుకంటే జగనన్న ప్రభుత్వం ఇల్లు లేని పేదలను గుర్తించి ఉచితంగా రూ. లక్షల విలువైన స్థలం రిజిస్ట్రేషన్ చేసి ఇంటిని నిర్మిస్తోంది. సచివాలయ వ్యవస్థతో లబ్ధిదారుల ఎంపిక అంతా పారదర్శకమే. ఇప్పటికే జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తయి ఊర్లను తలపిస్తున్నాయి. పేదలు గృహ ప్రవేశం చేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మేలును కొనియాడుతున్నారు. వీటన్నింటినీ మరిచిన ఎల్లో మీడియా అవాస్తవ కథనాలతో అభివృద్ధికే కళ్లకు గంతలు కట్టే ప్రయత్నం చేస్తోంది.

- ఊర్లను తలపిస్తున్న జగనన్న కాలనీలు
- 314 లేఅవుట్లలో శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు
- జిల్లాలో 56,522 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటికే 14,572 పూర్తి
- టీడీపీ హయాంలో మొదటి మూడేళ్లలో ఒక ఇల్లు మంజూరు చేయని వైనం
- అవాస్తవాలతో ఎల్లో మీడియా కథనం


నందికొట్కూరులోని జగనన్న కాలనీలో చురుగ్గా సాగుతున్న ఇళ్ల నిర్మాణాలు


గోస్పాడు మండలం దీబగుంట్ల గ్రామంలో జగనన్న లేఅవుట్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గృహాలు

నంద్యాల: అక్కచెల్లెమ్మలను సొంతింటికి యజమానులను చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన నవరత్నాల హామీల్లో 'అర్హులందరికీ పక్కా ఇళ్లు' పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. కొన్ని తరాలుగా గుడిసెలు, అద్దె ఇళ్లల్లో మగ్గిన పేద కుటుంబాలను సొంత గృహాలకు చేర్చుతున్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎల్లో మీడియా వాస్తవాలు దాచి అవాస్తవాలు ప్రచురిస్తూ విషం చిమ్ముతోంది. చంద్రబాబు నాయుడిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవడమే లక్ష్యంగా పచ్చపత్రికలు అడ్డగోలు రాతలు రాస్తూ అవాస్తవాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ కోవలోనే నంద్యాల జిల్లాలో 'పేదల ఇళ్ల రద్దు' అంటూ ఈనాడు గురువారం పతాక శీర్షికలో కథనం ప్రచురించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు విలువైన స్థలం ఉచితంగా ఇచ్చి ఇళ్లు మంజూరు చేసి నిర్మిస్తుంటే అవి పచ్చపత్రికలకు కనిపించడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నంద్యాల జిల్లాకు 56,522 ఇళ్లు మంజూరయ్యాయి. ఏపీ స్టేట్ హౌసింగ్ కింద 43,555 ఇళ్లు మంజూరు కాగా అందులో 14,244 ఇళ్లు పూర్తి కాగా 13 వేల ఇళ్లకు పైగా నిర్మాణాలు బేస్‌మట్టం, స్లాబ్ లెవెల్‌లో నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన కింద 12,967 ఇళ్లు మంజూరు కాగా ఇందులో 328 ఇళ్లు పూర్తిగా 2,100 ఇళ్లు బేస్‌మట్టం, స్లాబ్‌లెవెల్‌లో నిర్మాణాలు సాగుతున్నాయి. పేదల ఇంటి నిర్మాణానికి రూ.1.80లక్షలు ఇవ్వడమే కాకుండా పొదుపు గ్రూపులో సభ్యులుగా ఉన్న వారికి అదనంగా రూ.35 వేలు రుణం ప్రభుత్వం మంజూరు చేయిస్తోంది. అంతేగాకుండా సిమెంట్, ఇసుక, ఐరన్ వంటివి తక్కువ ధరకే లబ్ధిదారులకు అందజేస్తూ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తయ్యేలా ప్రోత్సహిస్తోంది. ఇవేమి పచ్చమీడియాకు కనపడకపోవడం ఆశ్చర్యకరం. అయితే ఏడాదిన్నరకు పైగా ఇళ్లు మంజూరు అయినా కొందరు లబ్ధిదారులు నిర్మించుకోలేదు. ఎందుకు కట్టుకోలేదో వివరణ అడిగినప్పుడు ఇళ్లు తమకు వద్దని అభిప్రాయం చెబితేనే వారి వివరణ తీసుకొని ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన కొందరి ఇళ్లను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ స్థానంలో ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన కింద 12,967 ఇళ్లను మంజూరు చేసింది. కాని ఇవేమి ఈనాడు పత్రికకు కనిపించలేదు. కేవలం రద్దయిన ఇళ్లను మాత్రమే చూపిస్తూ పేదల ఇళ్లు రద్దు అంటూ ప్రభుత్వంపై విషం చిమ్మింది.

'పట్టా'భిషేకం చేసి.. గృహప్రవేశానికి దారి వేసి

తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పేదలకు సెంటు స్థలం ఇవ్వలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామం, పట్టణాల్లో విలువైన స్థలాన్ని పేదలకు ఉచితంగా ఇచ్చి లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. పట్టాల పంపిణీ కార్యక్రమానికి ముందే జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేసి కాలనీల అభివృద్ధికి నిధులు కేటాయించారు. జిల్లాలోని 314 జగనన్న కాలనీల్లో 18,148 ఇళ్లు మంజూరు కాగా అందులో ఇప్పటికే 3,191 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 8,500 ఇళ్లు బేస్‌మట్టం, స్లాబ్ లెవెల్‌లో ఉన్నా వీటిని ఏ రోజు తమ పత్రికల్లో ప్రచురించని ఎల్లో మీడియా ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన కింద కొన్ని ఇళ్లను రద్దు చేస్తే వాటిపై గగ్గోలు పెడుతూ విషప్రచారం చేస్తోంది. అలాగే జిల్లాకు మంజూరైన ఇళ్లను తక్కువ చూపుతూ తప్పుడు కథనం ప్రచురించింది.

టీడీపీ హయాంలో ఇలా..

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన 2014 సంవత్సరం నుంచి 2016 సంవత్సరం చివరి వరకు ఒక్క ఇల్లు మంజూరు చేయకపోగా పాత వాటికి ఒక్క రూపాయి కూడా బిల్లు చెల్లించలేదు. 2019 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓట్ల కోసం పేదలపై కపటప్రేమ చూపించారు. ఎన్నికలకు రెండేళ్ల ముందు 26,509 ఇళ్లు మంజూరు చేయగా వాటిలో 12,243 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారు.

పేదల ఇళ్లు రద్దు వాస్తవం కాదు



అర్హులు ఎవరైనా ఇల్లు కట్టుకుంటామంటే ఇప్పటికీ ప్రభుత్వం మంజూరు చేస్తుంది. ఏడాదిన్నరగా ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన కింద ఇల్లు మంజూరు అయినా కట్టుకోక పోవడంతో వారిని అడిగి కొన్నింటిని రద్దు చేశాం. ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన కింద జిల్లాలో 12,967 ఇళ్లు మంజూరయ్యాయి. కొత్తగా మంజూరు అయిన ఇళ్ల గురించి ప్రజలకు చెప్పకుండా రద్దు చేసినవి మాత్రమే ఈనాడు పత్రికలో వచ్చింది. పేదల ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తోంది. లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

– భాస్కరనాయుడు, హౌసింగ్ పీడీ, నంద్యాల

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED

1. Teachers: Subjects Physical Science, Maths, English (For High School Qualifications: Degree with BEd)
2. All subjects for Primary school (Qualifications: DEd)
3. Warden for Boys, 4. Experienced Cook.

Pls send your CV to schoolsbirds@gmail.com (or) pls walk in for interviews at school working hours at
BIRDS SCHOOL CAMPUS,
Muthyalapadu (Vi), Chagalamarri (M), Nandyal dist AP.
Contact - 9849765862

VERY URGENTLY WANTED
Opportunity for Every one, you work we support
We are looking for young & Dynamic Candidates as a Manager for Newly Opening Branches in the Following Areas.
NANDYALA, ADONI, DHONE, YEMMIGANUR, KODUMUR, ATMAKUR.
1) AREA MANAGER : Male Required, Age : 25-40, Salary : 30,000 + Incentives + Allowances (Petrol, TA&DA, Mobile, health and Life insurance facility) Exp : MIN 3 years in any marketing (life Insurance and Banking sector preferable)
2) UNIT MANAGER : Male and female, Age : 25-35, Salary : 20,000 + Incentives + Allowances.
3) RECEPTIONIST and FRONT OFFICE EXECUTIVE : Females, Age : 25-30, Salary : 15,000 Fixed...
Interviews will be Held on 30-06-2023 at 10:00 AM
For more Details please call for further assistant
Cell:9966202019

కావలెను
భారత్ ఆగ్రో ఇండస్ట్రీస్ ఆదోని నందు పనిచేయుటకు ఉద్యోగాలకు అవకాశము కలదు. ఆసక్తిగల వారు క్రింది నెంబరుకు నేరుగా లేదా వాట్సాప్ ద్వారా సంప్రదించగలరు.

ఉద్యోగ హోదా	విద్యార్హత	అనుభవ అర్హతలు
సేల్స్ మేనేజర్	ఏదైనా డిగ్రీ	ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ లేదా ఇతర వ్యవసాయ సంబంధిత వ్యాపారములో అనుభవం కలిగి ఉండవలెను.
సేల్స్ మెన్స్	ఏదైనా డిగ్రీ	రైతు సంబంధిత వ్యాపారంలో అనుభవం మరియు మోటర్ సైకిల్ & డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండవలెను.
అకౌంటెంట్	ట్యాలి, ఎక్సెల్, వర్డ్	ఏదైనా వ్యాపార సంస్థలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
కంప్యూటర్ ఆపరేటర్	ఎక్సెల్, వర్డ్	డేటా ఎంట్రీలో అనుభవం కల వారికి ప్రాధాన్యత.
లేడి టెలికాలర్స్	ఎక్సెల్, డేటాఎంట్రీ	మంచి వాక్‌చాతుర్యం, టెలికాలర్‌గా అనుభవం కలవారికి ప్రాధాన్యత.
రిసెప్షనిస్ట్	ఏదైనా డిగ్రీ	కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండవలెను.

వాట్సాప్ నెం. 90007 53888 ఈ నెంబరుకు మీ యొక్క బయోడేటా పంపగలరు లేదా భారత్ ఆగ్రో ఇండస్ట్రీస్, ఎమ్మిగనూరు రోడ్డు, ఆదోని నందు సంప్రదించగలరు.

ఎదురూరులో యువకుడి దారుణ హత్య

- వివాహేతర సంబంధమే కారణం?


రామాంజనేయులు గౌడ్ (ఫైల్)

కర్నూలు: పొలంలో గడ్డి కోసుకురావడానికి వెళ్లిన యువకుడిని దారుణంగా హతమార్చారు. మృతదేహం కనిపించకుండా రబ్బరు చెట్ల మాటున పడవేశారు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమని తెలుస్తోంది. హతుని భార్య, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు మండలం ఎదురూరు గ్రామానికి చెందిన ఈడిగె రామాంజనేయులు గౌడ్ (37) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. బుధవారం మధ్యాహ్నం గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఉన్న దిన్నదేవరపాడు అయ్యన్న పొలంలో గడ్డి కోయడానికి వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో భార్య రాధమ్మ అతని కోసం పొలాల్లో గాలించినా కనిపించలేదు. కేసీ కెనాల్ గట్టుపై మోటార్ సైకిల్ కనిపించడంతో గురువారం ఉదయం కుటుంబ సభ్యులతో కలసి కెనాల్ కట్ట వెంట గాలిస్తుండగా రబ్బర్ చెట్లలో రామాంజనేయులు మృతదేహం బయటపడింది. విషయం తెలిసిన వెంటనే కర్నూలు అర్బన్ తాలూకా సీఐ శ్రీరామ్, ఎస్‌ఐ మన్మథ విజయ్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. ఎదురూరు గ్రామానికి చెందిన జయరాముడు, అతని సోదరుడు రాజుతో పాటు మరికొంతమంది కలసి రామాంజనేయులు తలపై బండరాయితోబాది వంద మీటర్ల దూరం ఈడ్చుకుంటూ వెళ్లి కేసీ కెనాల్ పక్కన రబ్బర్ చెట్లలో పడేసి పరారైనట్లు హతుడి భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు చేసింది. జయరాముడి భార్యతో వివాహేతర సంబంధం ఉండటం వల్లే తన భర్త రామాంజనేయులును హత్య చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. పలుమార్లు జయరాముడు, అతని తమ్ముడు రాజు తన భర్తతో గొడవ పెట్టుకుని చంపేస్తామంటూ బెదిరించేవారని తెలిపింది. మృతునికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు సంతానం. జయరాముడు, రాజుతో పాటు ఈశ్వరమ్మను కూడా అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

ప్రేమించిన యువతి తిరస్కరించిందని..

- యువకుడి బలవన్మరణం


ఆత్మహత్య చేసుకున్న బోయ మధు

కర్నూలు: ప్రేమించిన యువతి తిరస్కరించినందుకు జీవితంపై విరక్తి చెంది కర్నూలు నగరం బిర్లా గేట్ పోస్టాఫీసు ఎదురుగా ఉన్న కొట్టాలలో నివాసముండే బోయ మధు (25) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను బిర్లా గేట్ వద్ద టిఫిన్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున ఇంటి పక్కలోని ఖాళీగా ఉన్న రేకుల షెడ్‌లో ఇనుప పైపునకు దుప్పటితో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు కనుగొని ఉరి నుంచి తప్పించేసరికి అప్పటికే మృతిచెందాడు. మృతుని సోదరుడు బోయ విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫారెస్టు అధికారులకు జింకపిల్ల అప్పగింత



ఆదోని సెంట్రల్: జనావాసాల్లోకి వచ్చి గాయపడిన జింక పిల్లను గురువారం ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. మంద నుంచి తప్పిపోయిన జింకపిల్ల ఆదోని పట్టణం క్రాంతినగర్ కాలనీలోకి వచ్చింది. కుక్కలు దానిపై దాడి చేస్తుండడంతో కాలనీ వాసులు కాపాడారు. దానికి గాయాలు అవడంతో టుటౌన్ సీఐ శ్రీనివాసనాయక్‌కు సమాచారం అందించారు. ఆయన జింక పిల్లకు చికిత్స చేయించి ఫారెస్టు అధికారులకు అప్పగించారు.

తేజోమయం అహోబిలేశుడి దర్శనం

- శాస్త్రోక్తంగా జ్యేష్టాభిషేకం పూజలు


తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: దిగువ అహోబిల క్షేత్రంలో నరసింహ స్వామి జ్యేష్టాభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా పెరియాళ్వార్ తిరునక్షత్ర వేడుకలు చేపట్టారు. ఉత్సవమూర్తి శ్రీ ప్రహ్లాదవరదస్వామిని ప్రత్యేకంగా అలంకరించి గరుడవాహనంపై ఉంచి ఆలయ మాఢవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అలాగే శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరద స్వాముల ఉత్సవమూర్తులకు విశేష తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించి జ్యేష్టాభిషేకం పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి స్వయం తిరుమేనితో దర్శనం ఇవ్వడంతో భక్తులు తన్మయత్వం చెందారు. అహోబిలం ఆలయంలో స్వామికి ఏటా జ్యేష్ట మాసంలో మూడురోజులపాటు జ్యేష్టాభిషేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. దీనినే అభిద్యేయక అభిషేకం అని కూడా అంటారు. అత్యంత ప్రాచీనమైన ఉత్సవమూర్తులు నిత్యం అభిషేకాలతో అరుగుదలకు లోనవుతాయి. అవి క్షయానికి గురికాకుండా పరిరక్షించేందుకు వాటికి బంగారు కవచాలు తొడుగుతారు.. నిత్యాభిషేకాలు ఆ కవచాల మీదుగానే నిర్వహిస్తారు. ఏడాదికి ఒకసారి ఆ కవచాలను తొలగించి లోపల ఉన్న విగ్రహాలను శుభ్రం చేస్తారు. ఈ సమయంలోనే స్వామి స్వయం తిరుమేని (నిజరూపం దర్శనం)తో భక్తులకు దర్శనం లభిస్తుంది. ఉత్సవాల్లో భాగంగా స్వామికి మొదటి రోజు ముత్యాల కవచం, రెండో రోజు వజ్ర కవచం, మూడవ రోజు స్వర్ణకవచం ధరింపజేస్తారు. మళ్లీ జ్యేష్టాభిషేకం వచ్చేంత వరకు ఆ స్వర్ణ కవచంలోనే భక్తులకు దర్శనమిస్తారు. ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలన్, మణియార్ సొమ్యానారాయణ్, జీపీఏ సంపత్‌ల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

చేనేత వస్త్రాల విక్రయానికి ప్రత్యేక స్టాళ్లు

- నేతన్న మృతి చెందితే ఆర్థిక సాయం రూ.25 వేల పెంపునకు చర్యలు
- ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవులు


చెక్కులను అందిస్తున్న ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవులు

కర్నూలు(అర్బన్): ఆప్కో గోదాముల్లో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన వస్త్ర నిల్వలను తయారీ ధరకే 66, 50, 30 శాతం రిబేటుతో రాష్ట్ర వ్యాప్తంగా విక్రయించేందుకు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవులు చెప్పారు. చేనేత కార్మికుల సంక్షేమంతో పాటు సహకార సంఘాల బలోపేతానికి అనేక సంస్కరణలు తీసుకురావడం జరుగుతున్నదన్నారు. గురువారం ఆయన జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని చేనేత ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం స్థానిక కల్లూరు ఎస్టేట్‌లోని డీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ... ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా చేనేత కార్మికులకు నిరంతర ఉపాధి కల్పించడమే ఏకైక లక్ష్యంగా ఆప్కో పనిచేస్తున్నదన్నారు. చేనేత కార్మికులు నేసిన వస్త్రాలను పూర్తిగా కొనుగోలు చేసే బాధ్యతను ఆప్కో తీసుకుంటుందన్నారు. సహకార సంఘాల్లో నేత నేస్తూ మృతి చెందిన కార్మికులకు గతంలో ఇచ్చే రూ.12,500లను రూ.25 వేలకు పెంచుతామన్నారు. అలాగే సహకార సంఘాలకు రావాల్సిన బకాయిలన్నింటిని విడుదల చేస్తామన్నారు. నేతన్న నేస్తం ద్వారా అర్హులైన ప్రతి కార్మికుడికి న్యాయం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేతలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యతను ఇస్తూ వారి సంక్షేమానికి అనేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్కో మేనేజర్ పీ భారతి, ఆప్కో డైరెక్టర్లు యల్లా సుబ్బరాయుడు, వి వెంకటేశ్వర్లు, ఆప్కో, చేనేత, జౌళి శాఖ అధికారులు, చేనేత సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మృతి చెందిన 19 మంది చేనేత కార్మికుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.12,500 ప్రకారం చెక్కులను చైర్మన్ అందించారు.

క్లుప్తంగా

చిరుత సంచారం వాస్తవమే

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


తురువగల్లు గ్రామస్తులతో పత్తికొండ ఫారెస్టు బీట్ ఆఫీసర్ రాంమోహన్

ఆస్పరి: మండలంలోని తురువగల్లు కొండల్లో చిరుత సంచరిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పత్తికొండ బీట్ ఆఫీసర్లు రాంమోహన్, లక్ష్మన్న సూచించారు. గురువారం వారు తురువగల్లు గ్రామ సమీపంలోని కొండలను పరిశీలించారు. రైతులు, కూలీలు, గొర్రెలు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్న పిల్లలను పొలాలకు తీసుకెళ్లవద్దన్నారు. చిరుత దాడిలో మృతి చెందిన పశువులకు నష్టపరిహారం అందజేస్తామన్నారు. చిరుత కన్పించిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి దానిని బంధిస్తామని చెప్పారు. వీరి వెంట తంగరడోణ సర్పంచ్ శంకరమ్మ, గ్రామస్తులు రంగన్న, ఓబులేసు, గోపాల్‌రెడ్డి, నాగభూషణం, జ్యోతిరెడ్డి, శేఖర్, సుధాకర్ ఉన్నారు.

ట్రిపుల్ ఐటీలో ముగిసిన జాతీయ సదస్సు


సదస్సులో పాల్గొన్న వారితో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ డీవీఎల్ఎన్ సోమయాజులు

కర్నూలు సిటీ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ (ట్రిపుల్‌ఐటీ డీఎం)లో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. భారత దేశంలో గ్రీన్ హైడ్రోజన్.. సవాళ్లు, అవకాశాలపై సదస్సులో చర్చించారు. ముఖ్య వక్తలుగా యోగి వేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎం.శంకర్, ఐఐసీటీ ప్రధాన శాస్త్రవేత్త వెంకట్ మోహన్, ఏఆర్‌సీఐ(హైదరాబాదు) శాస్త్రవేత్త మణికార్తీక్ హాజరయ్యారు. ట్రిపుల్ ఐటీ డీఎం డైరెక్టర్ డీవీఎల్ఎన్ సోమయాజులు మాట్లాడుతూ.. గ్రీన్ హైడ్రోజన్ వినియోగం భవిష్యత్తులో భారీగా పెరనుందన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ రిజిస్ట్రార్ గురుమూర్తి, అసోసియేట్ డీన్ అకడమిక్స్ అండ్ రీసెర్చ్ యశ్వంత్, కో–ఆర్డినేటర్ రవీందర్ కట్ట, సదస్సు ఛైర్మన్ అమరనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య


మృతుడు కురువ రాముడు (ఫైల్)

సి.బెళగల్/నందవరం: అప్పుల బాధతో కంబదహాల్ గ్రామానికి చెందిన కురువ రాముడు (24) పురుగు మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల తెలిపిన కథనం మేరకు.. కురువ మాలన్న, ఈరమ్మ దంపతుల రెండో కుమారుడు రాముడు నందవరం మండలం నాగలదిన్నె గ్రామంలో బంధుమిత్రులతో కలిసి పురుగు మందు దుకాణం నడుపుతున్నాడు. గురువారం గ్రామం నుంచి నాగలదిన్నెకు వెళ్లిన రాముడు దుకాణంలో ఉన్న పురుగు మందుతాగాడు. అనంతరం తండ్రి కురువ మాలన్నకు ఫోన్ చేసి విషయాన్ని తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు నాగలదిన్నెకు చేరుకుని రాముడిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య యువరాణి, కుమార్తె ఉన్నారు. తమ కుమారుడు అప్పుల బాధ భరించలేక మృతి చెందినట్లు కురువ మాలన్న తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DISTANCE DEGREE & PG
■ Degree : B.Com - CA, BBA, BA, BCA, B.Sc, B.Com BLISc, PG, MA, MBA, MCA, MSC, M.Com MSW, MLISc. Sri Vijayadurga Degree College, Kurnool : Contact: 90306 28410, 93937 28410 [L-798710]

PARAMEDICAL
■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1450]

ఉచిత శిక్షణ ఉపాధి
■ గ్రామీణ నిరుద్యోగ యువతకు 4 నెలల కాల వ్యవధిలో కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, కోర్సులలో ఉచిత శిక్షణ, భోజన వసతి సదుపాయం, అర్హతను బట్టి ఉపాధి అవకాశాలు కల్పించబడును. Nihar skill Education,కడప. సంప్ర: 9063082227. [C-785822]

REAL ESTATE

PLOT FOR SALE
■ ఓర్వకల్లు–శకునాల సోలార్ పార్క్ ప్రక్కన, 30x40 (2.75 సెంట్లు) ప్లాటు కేవలం 3 లక్షలు మాత్రమే. కంతుల సౌకర్యం కలదు. సంప్ర: నితిక డెవలపర్స్, 98884 24222 [L-798711]

WANTED
■ హోటల్ నందు క్యాషియర్, స్టాల్ బాయ్స్, దోస, పూరి & చపాతి మాస్టర్, సౌత్ ఇండియన్ మాస్టర్, క్లీనింగ్ లేడీస్ పనిచేయుటకు కావలెను. సంప్ర: 91606 99996 [L-795106]

■ Breakthrough English స్కూలు శరీన్ నగర్, కర్నూలు నందు ప్రైమరీ, హైస్కూల్‌లో ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ బోధించుటకు లేడి టీచర్లు, పి.ఇ.టి & పనిచేయుటకు వాచ్‌మెన్లు, డ్రైవర్లు కావలెను. సంప్ర: 85007 79895, 83743 37750 [L-798707]

■ టూ వీలర్ షోరూం నందు అనుభవం కల్గిన స్పేర్స్ మేనేజర్, సర్వీస్ మేనేజర్ కావలెను. రాధా మానస బైక్స్ ప్రైవేట్ లి॥, బంగారుపేట, కర్నూలు. సెల్: 87126 13148 [L-795105]

■ డెంటల్ ల్యాబ్ నందు పనిచేయుటకు మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 6 నెలలు ట్రైనింగ్ ఇచ్చి తరువాత జాబ్ పర్మినెంట్ చేయబడును. 90523 83637, 90521 51265 [L-795104]

■ రాయలసీమ EM స్కూల్–కర్నూలు నందు 1st నుండి 8వ తరగతి వరకు ఇంగ్లీష్, మ్యాథ్స్ కంప్యూటర్ బోధించుటకు లేడి టీచర్స్ కావలెను. అర్హతలు: ట్రెయిన్డ్ & డిగ్రీ. సంప్ర: 99498 04648, 93982 52467 [L-799076]

■ కర్నూలులో ప్రముఖ షాపింగ్‌మాల్ నందు స్టోర్ మేనేజర్, శారీస్ మరియు లేడీస్ విభాగంలో అనుభవం కలిగిన ఫ్లోర్ ఇన్‌ఛార్జెస్, సేల్స్ స్టాఫ్, క్యాషియర్స్ కావలెను. 87123 44913, 91823 30362, 81858 37786 [L-799248]

■ TTC home tutor and baby handlar is Required to work in chandigarh. Salary: 15,000/- per month. Yearly 20 days holidays. Food/Accomodation is provided. Yearly once travel to home & Return will be paid. Age: 18 to 25, (Female) Cont: 94407 63924 [L-795101]

■ మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఫార్మా కంపెనీలో సెక్యూరిటీ గార్డులు కావలెను జీతం: 12000/- ఉచిత వసతి, భోజనసౌకర్యం కలదు: ESI, PF అదనం. ఫోన్: 6300661014. [HA-264]

■ ప్రముఖ బ్యాంకుల యందు కాంట్రాక్టు/ ఔట్ సోర్స్‌లో వర్క్ చేయడానికి ఫీమేల్ స్టాఫ్ అ॥కా॥ను. జీ: 15k-34k. ఇంట్రెస్ట్ ఉన్నవారు డిటేల్స్ వాట్సాప్ చేయండి. ఫోన్ : 6281159171 [HA-29751]

■ నందికొట్కూరులో ప్ర॥కంపెనీ నందు సెక్యూరిటీ సూపర్‌వైజర్, సె॥గార్డ్సు వెంటనే కావలెను. జీ॥ 12 to 15 వేలు రూం+భో ఫ్రీ. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, రాజమండ్రి. ✆ : 93922 69369 93979 10369 [R-33]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+భోజనం, జీ: 18K హైదరాబాద్: 9640258899, విజయవాడ: 9640648899 [HA-337]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/ పురుషులు కావలెను,ఆయా, వార్డ్ బాయ్స్,నర్సులు, వంటవారు, RMP Dr. Q:5th-Degree, 10-30 వేల జీతం, భో+రూం ఫ్రీ. Hyd. ఫోన్: 7995984445. [HA-340]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
94909 94349
94412 10725

గనుల శాఖ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం


ఒకేచోట కలుసుకున్న రాయలసీమ గనుల శాఖ రిటైర్డ్ ఉద్యోగులు

కర్నూలు(న్యూసిటీ): రాయలసీమ గనుల శాఖ రిటైర్డ్ అధికారులు, ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం గురువారం జిల్లా గనుల శాఖ అధికారుల ఆధ్వర్యంలో బెంగళూరు హైవేలోని ఓ రిసార్ట్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. ఉద్యోగులు 35 ఏళ్ల తరువాత తమ అనుభవాలను పంచుకునేందుకు కలుసుకోవడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని గత స్మృతులను నెమరువేసుకున్నారు. వైవాహిక, ఉద్యోగ జీవిత విశేషాలు, కుటుంబ నేపథ్యాలను చెప్పుకుంటూ సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ ఎంతో ఉత్సాహంగా గడిపారు. ఎక్కడెక్కడో ఉంటున్న ఉద్యోగులు ఒక చోటుకు చేరి నాటి మధుర జ్ఞాపకాలలో మునిగితేలారు. కార్యనిర్వహణ ఏర్పాట్లను రిటైర్డ్ ఏడీ వెంకటరెడ్డి, సూపరింటెండెంట్ వేదావ్యాస్ పర్యవేక్షించారు. అనంతరం రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ ఈఎస్ఎన్ శర్మ, పుల్లయ్య, కడప డీడీ వెంకటేశ్వర రెడ్డి.. రాయలసీమ జిల్లాల సూపరింటెండెంట్లు, అధికారులు, రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు.



అస్తమిస్తూ... అందాలు జారవిడుస్తూ!

వెలుగు ప్రపంచాన్ని మేల్కొలిపితే.. చీకటి నిద్రలోకి జారుకోమంటుంది.. ఈ రెండూ ఎప్పుడూ కలిసి ఉండవు. అయితే గురువారం సాయంత్రం కర్నూలు సమీపంలోని జగన్నాథ గట్టుపై వెలుగు, చీకటి కలిసిన దృశ్యం ఆవిష్కృతమైంది. అస్తమిస్తున్న భానుడికి దట్టమైన మేఘాలు అడ్డురాగా చిమ్మ చీకటిని చీల్చుకుని వెలుగు రేఖలు జగన్నాథ గట్టుపై పడుతున్న దృశ్యం కనువిందు చేసింది. సరికొత్త అనుభూతిని మిగిల్చింది.

– సాక్షిఫొటో గ్రాఫర్, కర్నూలు